సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 31 । జూలై । 2025



తెలుగు తమ్ముళ్ల ఘర్షణ

నందలూరు మండలం జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో భూ ఆక్రమణపై టీడీపీలోని ఇరువర్గాల నాయకుల మధ్య వివాదం చెలరేగింది. -8లో



గంజాయి ముఠా సభ్యుల అరెస్టు

అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 20 కిలోల గంజాయిని, ఎనిమిది సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.440	రూ.550
రెండోరకం	రూ.300	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 317 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

'మిట్స్' కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు



ఎన్‌బీఏ అక్రిడేషన్ అందుకుంటున్న మిట్స్ ప్రొఫెసర్లు


కురబలకోట: మదనపల్లె సమీపంలో అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలోని బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు మూడేళ్ల పాటు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ బుధవారం తెలిపారు. ఇది విద్యా నైపుణ్యం, నాణ్యమైన విద్య, ఫలితాల ఆధారిత అభ్యాసానికి గుర్తింపు అన్నారు. ఎన్‌బీఏ అక్రిడేషన్ వల్ల విద్యార్థులకు ఉద్యోగావకాశాల్లో కంపెనీలు అధిక ప్రాధాన్యత ఇస్తాయన్నారు. ఇక్కడి డిగ్రీలకు విదేశాల్లోను గుర్తింపు ఉంటుందన్నారు. విదేశీ ఉన్నత చదువులకు కూడా అవకాశం పెరుగుతుందన్నారు.

వందశాతం పింఛన్ల పంపిణీ చేపట్టాలి: కలెక్టర్



రాయచోటి: జిల్లాలో ఆగస్టు ఒకటో తారీఖున వందశాతం పింఛన్ల పంపిణీని చేపట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లో డీఆర్‌డీఏ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓ, ఎంపీడీవోలు, తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆగస్టు 1న జరగబోయే పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై సమీక్షించారు. పింఛను పంపిణీ చేసేవారు లబ్ధిదారులతో గౌరవంగా మెలగాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులకు ముందస్తు సమాచారాన్ని టామ్ టామ్, ఇతర మాధ్యమాల ద్వారా అందించాలని, వారు ఇంటి వద్దనే ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎల్డీఎం ఆంజనేయులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



రాజంపేట: రాజంపేట ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజరు గుండాల రమణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో ఎంపికైన డ్రైవర్లు పనిచేయాల్సి ఉంటుందన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు 18 నెలల అనుభవం కలిగి ఉండాలన్నారు. ప్రతి డ్రైవర్‌కు లైసెన్స్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు.మెడికల్ ఫిట్‌తో డ్రైవర్లను శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తయ్యాక విధుల్లోకి తీసుకుంటామన్నారు. ఆసక్తి కలిగిన డ్రైవర్లు అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్), రాజంపేట డిపోలో సంప్రదించాలన్నారు.వివరాలకు 6281612051, 7382868441 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మదనపల్లె సిటీ: ఆన్‌కాల్ పద్ధతిపై డ్రైవర్ పోస్టులకు అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆర్టీఓ క్లియరెన్స్ అర్హత సర్టిఫికెట్లతో వన్ డిపో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పీలేరురూరల్: పీలేరు ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు డీఎం బి. నిర్మల తెలిపారు.ఆర్టీఓ క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకుని డిపో మేనేజర్ కార్యాలయంలో ఆఫీస్ వేళల్లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ ఎస్టీ హబ్ అధికారి ఎస్.సురేష్

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ అధికారి ఎస్.సురేష్ అన్నారు. బుధ వారం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ, జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ సంయుక్తాధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హబ్ అధికారి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ యూనిట్లను రీఎంబర్స్‌మెంట్ పథకాలలో నమోదు చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు పారిశ్రామిక సంస్థలు ముందుకు రావాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఇంటరాక్షన్ నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్దన్, పరిశ్రమలశాఖ జీఎం చాంద్‌బా ష, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, జా తీయ ఎస్సీ ఎస్టీ హబ్ సభ్యులు వసంత్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

కదలరు.. వదలరు

- మంత్రి సమీక్షలో బట్టబయలైన అధికారుల తీరు
- 2018లో కుప్పంకు హంద్రీ–నీవా డివిజన్–12 కేటాయింపు
- కుప్పంలో ఏర్పాటు చేయకుండా మదనపల్లె ఎస్ఈ కార్యాలయంలోనే డివిజన్ నిర్వహణ
- సీఎం చంద్రబాబుకే మస్కా
- రూ.169 కోట్ల పనులున్నా మదనపల్లె నుంచే పర్యవేక్షణ
- అధికారులు హెడ్‌క్వార్టర్ కుప్పంలో నివాసం లేరని మంత్రే నిర్ధారణ





మదనపల్లె ఎస్ఈ కార్యాలయంలోని కుప్పం డివిజన్ కార్యాలయం

మదనపల్లె: సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నుంచి పని చేయాల్సిన హంద్రీ–నీవా ప్రాజెక్టు అధికారులు కుప్పానికి వెళ్లకుండా మదనపల్లెను వదలకుండా ఉండిపోతున్నారు. కుప్పంలో రూ. కోట్ల పనులు జరుగుతున్నా మేం ఇక్కడే ఉంటాం.. ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తామన్నట్లుగా అధికారుల ధోరణి వ్యక్త మవుతోంది. సాధారణంగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఉల్లంఘించే సాహసం ఏ అధికారి చేయడు. అయితే హంద్రీ–నీవా ప్రాజెక్టు అధికారులకు మాత్రం ధైర్యం, సాహసం ఉందని చెప్పాలి. 2018లో సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంకు హంద్రీ–నీవా డివిజన్–12 మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అంతా కుప్పానికి తరలి అక్కడినుంచే పాలన సాగించాలి. అయితే ఈ ఉత్తర్వు కేవలం కాగితానికే పరిమితమైపోయింది. ఈ ఉత్తర్వు సమయంలో కుప్పం ఉపకాలువ పనులు సాగుతున్నాయి. వీటి పర్యవేక్షణ సులువుగా, అధికారులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ప్రభుత్వం ఒకటి తలిస్తే ప్రాజెక్టు అధికారులు మరోకటి తలిచారు. సీఎం నియోజకవర్గమైతే మాకేంటి అనుకున్నారేమో కుప్పంలో డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయకుండా, మదనపల్లె నుంచే విధులు నిర్వహించే సాహసం హంద్రీ–నీవా ప్రాజెక్టు అధికారులది. 2015లో రూ.430 కోట్లతో టీడీపీ ప్రభుత్వం కుప్పం ఉపకాలువ పనులను చేపట్టింది. దీనితో అప్పటినుంచి మదనపల్లె ఎస్ఈ కార్యాలయం నుంచి విధులు నిర్వహిస్తున్న అధికారులు మదనపల్లె నుంచి కాకుండా కుప్పంలో ఉంటూ విధులు నిర్వహించేలా 2018లో కుప్పానికి డివిజన్ మంజూరు చేశారు. ఉన్నతాధికారులు కుప్పంలో డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేసి.ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇద్దరు డీఈఈలు, ఆరుగురు జేఈలు, ఆరుగురు క్లరికల్ సిబ్బంది, నలుగురు సాంకేతిక సిబ్బంది, మరో ఆరుగురు సాబార్డినేట్ సిబ్బంది ఇక్కడి నుంచి విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఇందులో చిత్తూరుజిల్లా వీ.కోటలో ఒక డీఈ, పలమనేరులో ఒక డీఈ వారికింద కొందరు జేఈలు విధుల్లో ఉండాలి. అయితే ఇప్పటి వరకు డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి సాహసానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఈఈకి మూడు చార్జ్ మెమోలు

కుప్పం లైనింగ్ పనుల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లుకు ఏకంగా మూడు చార్జ్ మెమోలను జారీ చేయాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించడం హంద్రీ–నీవా ప్రాజెక్టు వర్గాల్లో కలకలం రేగాలి. అయితే దీనిపై అధికారులు టేకి ట్ఈజీ అన్న ధోరణిలో కనిపిస్తున్నారు. సాక్షాత్తు మంత్రి చేసిన వ్యాఖ్యలపై కనీస స్పందనం లేదు. మంగళవారం మంత్రి ప్రాజెక్టు ఉపకాలువల పనులపై జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. కుప్పం కాలువ పనులకు సంబంధించి ఈఈ వెంకటేశ్వర్లు మీటింగ్‌కు హాజరుకాలేదు. దీనికితోడు హెడ్‌క్వార్టర్ కుప్పం లేరని నిర్ధారించి చర్యలకు ఉపక్రమించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఒకటి..హెడ్ క్వార్టర్‌లో ఈఈ నివాసం ఉండకపోవడం, రెండు..లైనింగ్ పనుల పూర్తిలో చురుగ్గా వ్యవహరించకపోవడం, మూడు..సమావేశాలకు హాజరుకాకపోవడంపై చార్జ్ మెమోలను ఇవ్వాలని ఆదేశించారు. ఈ చార్జ్‌మెమోలను తిరుపతి చీఫ్ ఇంజనీర్ జారీ చేస్తారని ఎస్ఈ విఠల్‌ప్రసాద్ బుధవారం సాక్షికి చెప్పారు.

అంతా మదనపల్లె నుంచే..

మదనపల్లెలో ప్రాజెక్టు సర్కిల్–3 కార్యాలయం ఉంది. ఇక్కడి నుంచి కుప్పంకు 120 కిలోమీటర్ల దూరం ఉంది. ప్రస్తుతం రూ.169 కోట్లతో రెండు రీచ్‌లతో కాంక్రీట్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. కుప్పం కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేసుంటే ఇక్కడినుంచి పర్యవేక్షణ పక్కగా జరిగేది. ప్రస్తుతం మదనపల్లె ఎస్ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసుకున్న కుప్పం డివిజన్ కార్యాలయం నుంచి అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తుండటంతో రోజూ కుప్పం కాలువ పనుల పర్యవేక్షణ సాగించాల్సి వస్తోంది. బుధవారం ఈఈ వెంకటేశ్వర్లు కార్యాలయం ఉండి ఇక్కడినుంచే విధులు నిర్వహించారు. ఇంతవరకు కుప్పంలో డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయకపోవడం, కనీసం అక్కడి నుంచైనా విధులు నిర్వహించకపోవడంతో కుప్పం లైనింగ్ పనుల పర్యవేక్షణ గాలికి వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ జీవోను సైతం ధిక్కరించి మదనపల్లె నుంచి విధులు నిర్వహిస్తున్న అధికారుల వ్యవహారం సాహసోపేతమైన నిర్ణయమనే చెప్పాలి.

తదుపరి చర్యలు ఏమిటి..

ఈఈకి మూడు చార్జ్‌మెమోలను ఇవ్వాలని ఆదేశించిన మంత్రి మదనపల్లెలో జరుగుతున్న కుప్పం డివిజన్ కార్యకలాపాలపై దృష్టి పెడతారా లేదా అన్నది తేలాలి. ఈఈ హెడ్‌క్వార్టర్‌లో నివాసం లేరని తేల్చగా ఇప్పుడు అక్కడ డివిజన్ కార్యాలయమే ఏర్పాటు చేయని అంశంపై ఎలా స్పందించాలి, ఎవరిపై చర్యలు తీసుకోవాలి. ఏడేళ్లకుపైగా కార్యాలయం ఏర్పాటు చేయకుండా అధికారులు ఏలా విధులు నిర్వహించారో తేల్చాలి. ఈఈపై చర్యలకు ఉపక్రమించిన మంత్రి ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా ధిక్కరించి మదనపల్లె ఎస్ఈ కార్యాలయంలో డివిజన్ కార్యాలయం నిర్వహణపై ఎవరిని బాధ్యులను చేస్తారు, ఎవరిపై చర్యలు తీసుకుంటారో తేలాలి. తక్షణమే డివిజన్ కార్యాలయాన్ని కుప్పంకు తరలిస్తారా లేదా అన్నది మంత్రి నిర్ణయం, చర్యలపై ఆధారపడి ఉంది.

వచ్చే నెల 2 నుంచి జమ్మలమడుగులో స్టాపింగ్



జమ్మలమడుగు: గుంటూరు–తిరుపతికి వెళ్లే రైలు ఆగస్టు 2 నుంచి జమ్మలమడుగులో స్టాపింగ్ ఉంటుందని రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల రైల్వే శాఖ ఉన్నతాధికారులు వచ్చినప్పుడు ఇక్కడి ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట, దాల్మియా పరిశ్రమల గురించి వివరించామని.., ఈ ప్రాంతం నుంచి గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు చదువుకునేవారి సంఖ్య ఎక్కువగా ఉందని జమ్మలమడుగులో ఈ రైలుకు స్టాపింగ్ ఇవ్వాలని కోరామన్నారు. దీంతో అధికారులు ఈనెల 2వతేది నుంచి రైలు నిలుపుతున్నట్లు ఉత్తర్వులను విడుదల చేశారన్నారు. అదేవిధంగా ధర్మవరం–మచిలిపట్నం రైలును కొండాపురం స్టాపింగ్ ఉంటుందని వివరించారు.

నేడు వైఎస్‌ఆర్ జిల్లాకు మంత్రి సవిత రాక

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత గురువారం కడపకు రానున్నారు. జిల్లాలో గురు, శుక్రవారాల్లో రెండ్రోజులపాటు పర్యటించనున్నారు. గురువారం ఉదయం 11.30 గంటలకు పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు జమ్మలమడుగుకు చేరుకుంటారు. ఆగస్టు 1న జమ్మలమడుగులో సీఎం చంద్రబాబునాయుడు పర్యటన నిమిత్తం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించనున్నారు. అనంతరం జమ్మలమడుగులోని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రికి కడపలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ చేరుకుని బస చేస్తారు. మరుసటి రోజు శనివారం జమ్మలమడుగులో జరగబోయే సీఎం చంద్రబాబునాయుడు కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొననున్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



గుడ్ల అమ్మకపు బండ్లను పంపిణీ చేస్తున్న మంత్రి మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్

రాయచోటి జగదాంబసెంటర్: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లో మంత్రి మండిపల్లి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లాలో వివిధ ఎస్‌హెచ్‌జీ గ్రూపుల నుంచి ఎంపిక చేసిన 10 గుడ్ల అమ్మకపు బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వల్లే మహిళా సాధికారత సాధ్యమైందన్నారు. మహిళా సంఘాలకు అందజేసిన గుడ్ల అమ్మకపు బండ్లు పౌష్టికాహారంతో పాటు గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కలిగిస్తాయన్నారు. ఒక్కో బండికయ్యే ఖర్చు రూ.50 వేలని, దీనిని ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు పౌష్టికాహారాన్ని అందివ్వడం, గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కలిగించడం కోసం గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం, జాతీయ గుడ్డు సమన్వయ కమిటీతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం మేరకు ఈ గుడ్ల అమ్మకపు బండ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం 2025–26లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు మొత్తం వెయ్యి ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని ఒక్కో సభ్యురాలికి ఒక గుడ్డు అమ్మకపు బండి చొప్పున సరఫరా చేయనున్నారన్నారు. మొదటి దశలో జిల్లాకు 10 గుడ్డు అమ్మకపు బండ్లు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కమనీయం.. పట్టాభిరాముడి కల్యాణం





పట్టాభిరామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతున్న సీతారామలక్ష్మణులు

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణంలోని శ్రీపట్టాభిరామాలయంలో బుధవారం పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, మూలవర్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామలక్ష్మణులకు వేద పండితులు స్నపన తిరుమంజనం జరిపారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని మండపంలో సీతారాముల శాంతి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం ఊంజల్ సేవ చేశారు. రాత్రి హనుమంత వాహనంపై సీతారామలక్ష్మణులను మాడ వీధులలో ఊరేగించారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు క్రిష్ణబట్టార్, భాష్యకాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

- పట్టాభిషేకం మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వైదిక కార్యక్రమాలు, స్నపన తిరుమంజనం, శ్రీరామ పట్టాభిషేకం, సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రికి గురుడ వాహనంపై శ్రీసీతారాముల విహారం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

కాలం చెల్లిన రూపాయి అద్దె

- 69ఏళ్లుగా కొనసాగుతున్న తంతుకు మంగళం
- రూ. కోట్లు విలువ చేసే స్థలం పురపాలిక పరం





రాజంపేట పాతబస్టాండులో పురపాలకసంఘంలో ఏర్పాటైన పెట్రోలు బంక్

రాజంపేట: దాదాపు రూ.10 కోట్లు విలువ చేసే పురపాలక స్థలానికి అద్దె రూపాయి చెల్లించేవారు. వినడానికి ఆశ్చర్యంగా ఉంది కదూ.. ఇది నిజం..ఇది ఎక్కడో కాదు.. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పట్టణంలోని పాతబస్టాండు నడిబొడ్డున తిరుపతి వైపు ఉన్న వంకదారి సత్యనారాయణ పెట్రోలు బంకు కథ.. రాజంపేటలో ఇంటి బాడుగలు ఆకాశంలో ఉంటాయి.అలాంటిది ఏకంగా 19 సెంట్ల స్థలం ఆరుదశాబ్దాలకు పైగా రూపాయి అద్దెతో కొనసాగేది. ఎట్టకేలకు ఈ స్థలం పురపాలికపరమైంది. పెట్రోలు బంకు స్వాదీనానికి పురపాలక సంఘం చర్యలు తీసుకుంది. ఈ స్థలాన్ని పురపాలికపరం చేయడంలో రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి కృషి ప్రశంసనీయమని పట్టణవాసులు చెబుతున్నారు.ఆయన చైర్మన్ అయిన తర్వాత కౌన్సిల్ సహకారంతో రూ.అద్దె వ్యవహారానికి స్వస్తి పలికించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు పరోక్షంగా పెట్రోలు బంక్ ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశాలు ఆవిష్కృతం కానున్నాయి.

- 19 సెంట్ల స్థలాన్ని 69 ఏళ్లుగా రూపాయి అద్దెతో కొనసాగిస్తున్నారు. ఈమేరకు బుధవారం చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో పెట్రోలు బంకు పురపాలిక పరమైనట్లుగా ప్రకటించారు. ఈ ప్రతిపాదనను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. సంబంధిత పెట్రోలు బంక్ యాజమాన్యం కూడా మున్సిపాలిటీకి ఇచ్చేందుకు ముందుకొచ్చినట్లు కౌన్సిల్‌వర్గాలు తెలిపాయి. ఫలితంగా మున్సిపాలిటీకి అదనంగా ఆదాయం వచ్చేందుకు మార్గం సుగమమైంది.

లీజు వ్యవహారం ఇలా..

1954లో సర్వే నంబరు 961/ఏలో రాజంపేట పురపాలకసంఘానికి(అప్పట్లో మేజర్ పంచాయతీ) సంబంధించిన 19 సెంట్ల స్థలాన్ని వంకదారి సత్యనారాయణ అనే వ్యక్తికి లీజుకు ఇచ్చారు. అప్పట్లో కేవలం రూపాయి అద్దెతో ఆ స్థలాన్ని నేటి వరకు వినియోగించుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం ఈ స్థలంలో పెట్రోలు బంక్‌ను ఏర్పాటుచేశారు. భారత్‌పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ లీజుకు తీసుకుంది. స్థలానికి సంబంధించి అగ్రిమెంట్స్ కూడా చేసుకున్నారు. అగ్రిమెంట్ కాలం ముగిసి కొన్ని సంవత్సరాలు అవుతోంది.

నోటీసులిచ్చినా..

సుమారు 40 సంవత్సరాలుగా రూపాయి కూడా అద్దె చెల్లించకుండా ఉచితంగా పెట్రోలు బంకు నిర్వహిస్తున్నారు.ఈ విషయంలో చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి రంగప్రవేశం చేశారు. మున్సిపాలిటీ వారు నోటీసులు అందచేశారు. వెంటనే స్థలాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. ఇందుకు నిర్వహకులు రెండు మాసాలు గడువు కోరారు. రెండునెలలు పూర్తయినా పెట్రోలు బంకు నిర్వాహకులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారు. దీంతో పురపాలక సంఘం కౌన్సిల్ సీరియస్‌గా తీసుకుంది. ఎట్టకేలకు పెట్రోలుబంకు స్థలాన్ని కైవసం చేసుకుంది.


పురపాలిక స్థలం స్వాధీనం



స్థలం విషయంపై కౌన్సిల్ ఏకగ్రీవం తీర్మానం చేసింది. 2015 నుంచి జనవరి 24వ తేదీ వరకు స్థలం నిర్వహకులకు అనేక మార్లు నోటీసులు ఇచ్చారు. ప్రస్తుతం దీనిని స్వాధీనం చేసుకున్నారు. దీని వల్ల పరోక్షంగా పురపాలక సంఘానికి ఆదాయ వనరులు సమకూరుతాయి. అంతేకాకుండా పెట్రోలు బంక్ నిర్వహణ మున్సిపాలిటీనే చూసుకునేలా కౌన్సిల్‌లో ప్రతిపాదనలు పెట్టాం.

–పోలా శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ చైర్మన్

పెద్దచెప్పలి ఘటన దురదృష్టకరం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న వైఎస్ఆర్ జిల్లా డీఈఓ షంషుద్దీన్

కమలాపురం: వైఎస్ఆర్ జిల్లా పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఓబుళరెడ్డి మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ఘటన దురదృష్టకరం అని డీఈఓ షంషుద్దీన్ అన్నారు. ఈ ఘటనపై స్పందించిన వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ హెచ్‌ఎంను సస్పెండ్ చేయడంతో పాటు డీఈఓను విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు బుధవారం డీఈఓ పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. హెచ్‌ఎం ప్రవర్తన గురించి పాఠశాలలోని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తాగిన విషయం వాస్తవమేనని, కొన్ని రోజులుగా తాగి పాఠశాలకు వస్తున్నారని డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం డీఈఓ మీడియా సమావేశంలో మాట్లాడారు. సమాజంలో విద్యార్థులు ప్రజలు, తల్లిదండ్రులు, ఇరుగు పొరుగువారితో ఎలా మెలగాలో, ఎలా ప్రవర్తించాలో విద్యా బుద్ధులు నేర్పే వారే ఇలా మద్యం తాగి పాఠశాల రావడం తప్పు అన్నారు. చేసిన తప్పు హెచ్‌ఎం ఒప్పుకున్నారన్నారు. ఉపాధ్యాయులు సైతం పలుమార్లు హెచ్‌ఎంను ఇలా చేయడం సరికాదని చెప్పినప్పటికి ఆయన పద్ధతి మార్చుకోకపోవడం బాధాకరం అన్నారు. ఇప్పటికే ఆయనను కలెక్టర్ సస్పెండ్ చేశారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : ఆటో ఢీకొని బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. పుంగనూరు మండలం ఈడిగిపల్లికి చెందిన షాంషా బొమ్మల వ్యాపారం కోసం కుమారుడు ప్రవీణ్(15)తో మదనపల్లెకు వచ్చింది. తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లడానికి తమ బంధువులతో కలిసి ఆటోలో బయలుదేరింది. పట్టణ శివారు ప్రాంతమైన పుంగనూరు రోడ్డు మహీంద్రా షోరూం వద్దకు రాగానే, వారు ప్రయాణిస్తున్న ఆటో పక్కకు నిలిపి, ప్రవీణ్ ఆటో దిగి పక్కనే ఉండగా, ఎదురుగా మరో ఆటో వేగంగా వచ్చి బాలుడిని ఢీకొంది. ప్రమాదంలో ప్రవీణ్ తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రేఫర్ చేశారు.

విద్యుత్ షాక్‌తో పశ్చిమ బెంగాల్ వాసికి తీవ్ర గాయాలు

నిమ్మనపల్లె : విద్యుత్ షాక్‌తో పశ్చిమ బెంగాల్ వాసి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం నిమ్మనపల్లి మండలంలో జరిగింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డోక్సిబర్ధ్వార్ జిల్లా, బిశ్వంతపూర్ పోస్ట్, రూపాటా గ్రామానికి చెందిన సునేరామ్ (30), అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి, నిమ్మనపల్లెలో ఆర్డీఎస్ఎస్ (రీ వాంపేడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్)లో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న కేబుల్ పనులు చేసేందుకు ఏడు నెలల క్రితం ఇక్కడికి వచ్చాడు. ముష్టూరులో నివాసం ఉంటూ స్థానికంగా పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రెడ్డివారిపల్లె పంచాయతీ బాలేవాండ్లపల్లె సమీపంలో పనులలో భాగంగా సునేరామ్ విద్యుత్ పోల్ ఎక్కి మరో వ్యక్తితో కలిసి పనులు చేస్తుండగా, మరో లైన్ లోని వైర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురై కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. మరో వ్యక్తికి స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తరలించగా, సునేరామ్‌ను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

అమ్మా నాన్నా.. నన్ను క్షమించండి

– ఫ్యాన్‌కు ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

లింగాల : లింగాల మండలం తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎర్ర మేకల భరత్ కుమార్ (23) బుధవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ యువకుడు గత కొన్ని సంవత్సరాల నుంచి కుడి కన్ను సమస్యతో బాధపడుతుండే వాడు. ఇటీవల కుడి కన్ను పూర్తిగా చూపు కోల్పోయింది. దీనికి తోడు మైగ్రేన్ తలనొప్పి వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు సమాచారం. ×నా చావుకు నేనే కారణం.. ప్రతి రోజు హాస్పిటల్ చుట్టూ తిరగలేకున్నా.. నా ఆరోగ్యం రోజు రోజుకు ఇబ్బందిగా ఉంది.. అమ్మా.. నాన్నా నన్ను క్షమించండి అంటూ మృతుడు సూసైడ్ నోట్ రాశాడు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లె-తోట్లపల్లె గ్రామాల మధ్యలోని రహదారిలో బుధవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన సుబ్బయ్య కుమారుడు సూరి, ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న ప్రసాద్ కుమారుడు సన్నిలు వేర్వేరు బైక్‌లలో వస్తుండగా ప్రమాదవశాత్తు ఢీ కొన్నాయి. తీవ్రంగా గాయపడిన ఇరువురిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిధుల కోసం నిరీక్షణ

- అందని 15వ ఆర్థిక సంఘం నిధులు
- కేంద్రం ఇచ్చిన పంచాయతీ నిధులను కూటమి ప్రభుత్వం దారి మళ్లింపు
- 7 నెలలుగా పంచాయతీ ఖాతాల్లో జమ కాని నిధులు
- ఫిబ్రవరితో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం
- నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న సర్పంచులు



నరసాపురంలో ఎంపీడీఓ కార్యాలయం

కాశినాయన : పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను కూటమి ప్రభుత్వం దారి మళ్లించింది. కేంద్రం మంజూరు చేసిన ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఖాతాలకు జమ చేయడం లేదు. రెండు విడతలుగా కేంద్రం నుంచి వచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు వినియోగించుకుంటూ పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదు. దీంతో గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం పనులకు ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం వానా కాలం కావడంతో గ్రామాల్లో కాలువల్లో పూడికతీత, బ్లీచింగ్ చల్లించడంతోపాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయడం వంటి పనులకు సైతం నిధులు లేని పరిస్థితి నెలకొందని గ్రామ పంచాయతీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి కడప జిల్లాల్లో 802 గ్రామ పంచాయతీలు

ఉమ్మడి కడప జిల్లాలో 802 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మేజర్, మైనర్ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలకు ఏటా రెండు విడతల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతాయి. సంవత్సరానికి మూడు సార్లు ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అయితే రెండు విడతల్లో 802 గ్రామ పంచాయతీలకు రూ.98 కోట్లకుపైగా జిల్లాకు నిధులు మంజూరవుతాయి. ఈ నిధులను జనాభా ప్రాతిపదికను గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ఏడు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.910 కోట్లపైగా నిధులు మంజూరు చేసింది. ఈ నిధులు నేటికీ గ్రామ పంచాయతీలకు అందలేదు. కేంద్రం మంజూరు చేసిన నిధులను ప్రభుత్వం దారి మళ్లించి కాలయాపన చేస్తోందని సర్పంచ్‌లు వాపోతున్నారు.

పారిశుధ్యం అధ్వానం..

వర్షాకాలం అయినందు వల్ల గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. తాగునీటి బోర్లు రిపేరు చేసేందుకు నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తే గ్రామాల్లో తాగునీటి సమస్యతోపాటు కాలువల్లో పూడికతీత పనులు, తాగునీటి పైపులైన్లు, బోర్ల రిపేరులకు వాడుకుంటారని సర్పంచ్‌లు అంటున్నారు.

ఫిబ్రవరిలో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం

2026 ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోయినా సర్పంచ్‌లు సొంత డబ్బు ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఇంత వరకు బిల్లులు రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎదురు చూపులు

15వ ఆర్థిక సంఘం నిధులు ఎప్పుడు పంచాయతీ ఖాతాల్లో జమ అవుతాయా అని గ్రామ సర్పంచ్‌లు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా రూ.98 కోట్లు మంజూరు కావాల్సి ఉంది. ఇప్పటికే పారిశుధ్యం, తాగునీటి అవసరాల కోసం సర్పంచ్‌లు తమ జేబుల నుంచి డబ్బులు ఖర్చు పెట్టి ప్రజా అవసరాలను తీర్చుతున్నారు. పనులు చేయకపోతే జిల్లా స్థాయి అధికారులు టార్గెట్ చేస్తున్నారని, గత్యంతరం లేక కొందరు సర్పంచ్‌లు, కార్యదర్శులు వడ్డీలకు అప్పులు తెచ్చి ఖర్చు పెడుతున్నారు. ఎప్పుడు నిధులు మంజూరవుతాయో తెలయడం లేదని, వడ్డీలు మాత్రం కట్టాల్సి వస్తోందని కన్నీరు పెడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

దౌర్జన్యంగా ఇంటిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం

మదనపల్లె రూరల్ : ఇంటిలో తమకు హక్కు ఉందని పేర్కొంటూ, జేసీబీతో గోడను కూల్చివేసి దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నించిన ఘటన బుధవారం అంకిశెట్టిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లె టీచర్స్ కాలనీలో జరిగింది. పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన కె.వెంకటరమణ, శంకరలు అన్నదమ్ములు. వీరికి వారసత్వంగా తండ్రి నుంచి సంక్రమించిన ఇంటి విషయమై చాలా కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇంటిలో వెంకటరమణతో పాటు అతడి ఇద్దరు కుమారులు నరేంద్ర, శ్యాంసుందర్, కోడళ్లు శోభ, మంజుల, మనమరాళ్లు భవ్య, పూర్విక, తన్వి నివాసం ఉంటున్నారు. ఈ ఇంటిలో తమకు భాగం ఇవ్వాల్సిందిగా శంకర కోరుతూ వస్తున్నాడు. పెద్దమనుషుల వద్ద పంచాయతీ జరుగుతోంది. ఈ క్రమంలో శంకర జేసీబీని తీసుకువచ్చి ఇంటి గోడను కూల్చివేసేందుకు ప్రయత్నించాడు. ఇంట్లో నిద్రపోతున్న కోడళ్లు శోభ, మంజుల, మనమరాళ్లపై దాడికి దిగి, ఇంట్లోని సామానులు బయటపడేసి వెళ్లిపోవాల్సిందిగా దౌర్జన్యానికి దిగారు. దీన్ని చూసి అడ్డుకునేందుకు ప్రయత్నించిన వెంకటరమణ కూతురి కుమారుడు మనోజ్‌ను, వరసకు చినతాత అయిన శంకర వీపుపై కొరికి గాయపరిచాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ఇంటిలోని సామానులు చిందరవందరగా పడేసి దౌర్జన్యానికి పాల్పడిన దృశ్యం

బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రాజంపేట : రైల్వేకోడూరులో బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధరల కల్పించే విషయంలో సిండికేట్లు వెనక్కి తగ్గడం లేదంటూ బుధవారం రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమానైదియాదేవికి రైతు సంఘం నేతలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరేట్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, రైతు సంఘం జిల్లానేత పందికాళ్ల మణి మాట్లాడుతూ రైల్వేకోడూరు బొప్పాయి వ్యాపారులు,సేట్లు సిండికేట్ కావడంతో బొప్పాయి రైతులకు ధర తగ్గిస్తున్నారన్నారు. కోట్లలో వ్యాపారం చేస్తున్న వారికి ఎలాంటి లైసెన్స్‌లు లేవన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. టన్నుపై రైతు లక్షన్నర నష్టపోతున్నాడన్నారు. మరో వైపు 1000 కేజీలకు 100 కేజీలు సూటు పేరుతో రైతును దగా చేస్తున్నారన్నారు. కిలో రూ.25 ధర కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. రెండు రోజుల్లో బొప్పాయి రైతుల ధరల సమస్య పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ వైఖోమా నైదియాదేవి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు నేతలు ఆదినారాయణ, తుంగ శివకృష్ణ, మన్నూరు విశ్వనాథరెడ్డి, తిరుమల చరణ్, ఈర్ల ఈశ్వరయ్య, ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్

జాతీయ స్థాయిలో కలికిరి సైనిక పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



హాకీ పోటీలలో రన్నరప్‌గా నిలిచి సిల్వర్ ట్రోఫీ అందుకుంటున్న కలికిరి సైనిక పాఠశాల బాలికల టీం

కలికిరి : తమిళనాడు రాష్ట్రం అమరావతినగర్ సైనిక పాఠశాలలో ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా సైనిక పాఠశాలల ఆటల పోటీలలో కలికిరి సైనిక పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. అండర్ 17 విభాగం హాకీ జట్టు ఫైనల్‌కు చేరుకుని రన్నరప్‌గా నిలిచినట్లు కలికిరి పాఠశాల ప్రిన్సిపాల్ సీఏస్ పరదేశి తెలిపారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ పోటీలలో కలికిరి టీం స్వల్ప తేడాతో ఓటమి చవిచూసినప్పటికీ గెలుపుకోసం అసాధారణంగా పోరాడిందన్నారు. ఈ సందర్భంగా హాకీ టీం బాలికలకు ఆయన అభినందనలు తెలిపారు.

ఆగస్టులో విశేష పూజలు

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయం, దేవుని కడప శ్రీ లక్ష్మివేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆగస్టులో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ మేరకు బుధవారం టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఒంటిమిట్ట ఆలయంలో ఆగస్టు 8న ఉదయం వరలక్ష్మి వ్రతం, 9న పౌర్ణమి సందర్భంగా ఉదయం శ్రీ సీతారాముల కల్యాణం, 23 నుంచి 26వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు.

దేవుని కడప ఆలయంలో..

ఆగస్టు 8న వరలక్ష్మి వ్రతం సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సౌభాగ్యం, 9న శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి తిరుమంజనం, 18, 19, 20 తేదీలలో ఆలయంలో బాలాలయం, జీర్ణోద్ధరణ, 24న పుబ్బ నక్షత్రం సందర్భంగా శ్రీ ఆండాళ్ అమ్మవారికి తిరుమంజనం, గ్రామోత్సవం, 25న ఉత్తరా నక్షత్రం సందర్భంగా శ్రీ పద్మావతీ అమ్మవారికి స్నపన తిరుమంజనం, ప్రాకారోత్సవం నిర్వహించనున్నారు.

పార్టీకి అండగా నిలబడతాం

మాజీ సీఎంతో యూఏఈ కో-కన్వీనర్ సయ్యద్ అక్రమ్

రాయచోటి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని యూఏఈ కో-కన్వీనర్ సయ్యద్ అక్రమ్ అన్నారు. బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్‌తో కలిసి అక్రమ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గల్ఫ్ దేశాలలో పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తున్నట్లు మాజీ సీఎంకు తెలిపారు. కుటుంబ పోషణ నిమిత్తం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి గల్ఫ్ దేశాలకు వచ్చిన వారి పరిస్థితులపై జగన్ మోహన్ రెడ్డి ఆరా తీశారు. ఈ సందర్భంగా గల్ఫ్ దేశాలలో వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వారు వివరించారు.



మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డితో యూఏఈ కో-కన్వీనర్ సయ్యద్ అక్రమ్ తదితరులు

తెలుగు తమ్ముళ్ల ఘర్షణ

సుండుపల్లె : మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో భూ ఆక్రమణపై టీడీపీలోని ఇరువర్గాల నాయకుల మధ్య వివాదం చెలరేగింది. బుధవారం ఆక్రమిత స్థలం వద్ద ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. అసభ్య పదజాలాలతో దూషించుకుంటూ ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు. ఇదంతా చూస్తున్న రెవెన్యూ అధికారులు ప్రేక్షకపాత్ర వహించాల్సి వచ్చింది. వివరాలు ఇలా.. మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీ కోనంకివాండ్లపల్లె సమీపంలో సర్వే నెంబర్ 731-4లో 0.73 సెంట్లు ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన మేడా వర్గీయుడు అరుణ్‌కుమార్ ఆక్రమించాడని జగన్‌మోహన్‌రాజు వర్గీయులు ఆంజనేయులు నాయుడు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై బుధవారం రెవెన్యూ అధికారులు ఆక్రమిత స్థలం వద్దకు పరిశీలనకు వచ్చారు. అయితే అక్కడికి ఫిర్యాదు చేసిన వారు కూడా రావడంతో ఇరువర్గాలు అసభ్య పదజాలంతో దూషించుకుంటూ గొడవపడ్డారు. జగన్‌మోహన్‌రాజు వర్గానికి చెందిన కనికలపాటి ఆంజనేయులు తనను జొన్నల అరుణ్‌కుమార్, వెంకటరమణ, ఉగ్గారపు శివకుమార్ అసభ్యకరంగా దూషించి కొట్టారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏఎస్ఐ అయూబ్‌ఖాన్ కేసు నమోదు చేశారు.



టీడీపీలోని ఇరువర్గాలు బాహాబాహీకి దిగిన దృశ్యం

వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో నలుగురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లి మండలం పోతబోలు పంచాయతీ పాలెం కొండకు చెందిన గంగాధర్ (25) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో బుధవారం గ్రామానికి సమీపంలో పురుగు మందు తాగాడు. పీటీఎం మండలం మల్లెల పంచాయతీ ఉప్పరోళ్లపల్లెకు చెందిన నాగరాజు (38) భార్యతో గొడవపడి ఇంటి వద్ద పురుగుమందు తాగాడు. పుంగనూరు మండలం బసినేపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు రెడ్డప్ప (35) కార్పెంటర్ గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. వ్యాపార అవసరాల కోసం పలువురు వద్ద రూ.4 లక్షలు అప్పు చేశాడు. రుణాలు చెల్లించడంలో ఇబ్బందులు తలెత్తడంతో రుణదాతలు ఒత్తిడి చేశారు. దీంతో మనస్థాపానికి గురై పురుగు మందు తాగాడు. అదేవిధంగా మంగళవారం రాత్రి మదనపల్లి మండలం బొమ్మనచెరువు పంచాయతీ టీకులపాలెంకు చెందిన రాము భార్య మౌనిక (21) కుటుంబ సమస్యలతో విషద్రావణం తాగింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొడతాం

సింహాద్రిపురం : స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజా ఉద్యమం తప్పదని వాటిని ఎక్కడ బిగించినా పగులగొడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. బుధవారం ఆయన అంకాలమ్మ గూడూరులో జరిగిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ సంస్కరణలు తానే తెచ్చానని చంకలు గుద్దుకోవడం కాదని ఆ సంస్కరణలు ప్రజలపైన పెను భారాలు మోపుతున్నాయని చెప్పారు. గతంలో విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడంతో ప్రజా తిరుగుబాటుతో ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఆగస్టు 5న జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి వెంకటరాములు, సహాయ కార్యదర్శి కాల్వ బ్రహ్మం, జిల్లా సమితి సభ్యులు ఈశ్వరయ్య, అమీర్, అనిల్, వినయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి గేటు మీద పడటంతో చిన్నారి దుర్మరణం

ముద్దనూరు : అవ్వగారింటి వద్ద ఆనందంతో ఆడుతూ పాడుతూ వున్న చిన్నారి కుటుంబంలో ఇంటిగేటు విషాదం నింపింది. మండలంలోని నల్లబల్లె గ్రామంలో ఇంటివద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు ఇంటి గేటు అనుశ్రీ అనే చిన్నారిమీద పడడంతో చిన్నారి దుర్మరణం చెందింది. బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలు మృతురాలి కుటుంబీకుల సమాచారం మేరకు .. తొండూరు మండలం ఊడగండ్ల గ్రామానికి చెందిన రవికుమార్, గాయత్రిల ఆరేళ్ల కూతురు అనుశ్రీ అవ్వగారి గ్రామమైన నల్లబల్లెకు వచ్చింది. అనుశ్రీ ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఇంటి ప్రహరీకి అమర్చిన ఇనుప గేటు అకస్మాత్తుగా చిన్నారిపై పడింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అనుశ్రీని ముద్దనూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. పై బంధువులలో విషాదం చోటుచేసుకుంది.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

కొమరోలు: భార్యతో మనస్పర్థల కారణంగా భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొమరోలులోని సినిమా హాలు సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలం తురకపల్లి గ్రామానికి చెందిన ఆది(29), సమ్రీన్ ప్రేమ వివాహం చేసుకుని గత 8 నెలలుగా కొమరోలులో నివాసం ఉంటున్నారు. ఆది తన స్నేహితుడు ఖాశింవలి ద్వారా ఇక్కడ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య కొద్ది రోజులుగా మనస్పర్థలు పొడచూపాయి. బుధవారం రాత్రి మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన ఆది ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

బ్యాంకు దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఆర్థిక మోసాలను నివారించేలా చర్యలు
- భద్రతా ప్రమాణాలపై బ్యాంకర్లతో జిల్లా ఎస్పీ సమీక్ష



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : బ్యాంకులలో దొంగల నుంచి వినియోగదారులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించే విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లాలోని బ్యాంక్ అధికారులను జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. బ్యాంకుల భద్రతా ప్రమాణాలపై జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంకులలో దొంగతనాలు జరగకుండా తగు జాగ్రత్తలు, బ్యాంకులలో సీసీ కెమెరాల వినియోగంపై ఆరా తీశారు. సీసీ కెమెరాలు రికార్డు అయ్యే దృశ్యం స్పష్టంగా కనపడేలా అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రవేశం, నిష్క్రమణ మార్గాల్లు, క్యాష్ కౌంటర్లు, ఏటీఎంలు, లాబీలు అన్నింటినీ కవర్ చేసే విధంగా సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. నగదు రవాణా సమయంలో శిక్షణ పొందిన లైసెన్సు కల్గిన ఆయుధం ఉన్న గార్డులను నియమించాలన్నారు. బ్యాంకు అనుసంధానంగా పనిచేసే గార్డు నుండి సిబ్బంది వరకు వారి వివరాలు తెలిసి ఉండాలని సూచించారు. ప్రతి బ్యాంకులో కూడా సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బ్యాంకులో ఏదైనా జరిగేతే అలారం పోలీసు స్టేషన్‌లో మోగేలా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. బ్యాంకులోని ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిపై పోలీసు వెరిఫికేషన్ తప్పనిసరిగా జరిపించాలన్నారు. బ్యాంకు పరిసరాలలో ముఖ్యంగా రాత్రిపూట సరైన వెలుతురు ఉండేలా చూడాలన్నారు. అత్యవసర కాల్ నెంబర్లు, హెల్ప్‌లైన్ నెంబర్లను స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ప్రతి ఖాతాదారుడి లావాదేవీలను అప్రమత్తంగా గమనిస్తూ ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటీపీల గురించి ఖాతాదారులను హెచ్చరించాలన్నారు. బ్యాంకులలో అపరిచిత వ్యక్తులను గమనించినప్పుడు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. సీసీ కెమెరాల రికార్డు దృశ్యాన్ని కనీసం ఆరు నెలలు నిల్వ ఉండేలా భద్రంగా చూసుకోవాలన్నారు. అనుమానాస్పద బ్యాంకు ఖాతాలను పోలీసు వారు అడిగినప్పుడు వెంటనే అందించేలా పోలీసులకు సహకరించాలన్నారు. బ్యాంకులోకి వచ్చిన ఖాతాదారులను హెచ్చరిస్తూ మోసాల గురించి తెలియజేస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని ప్రదేశాలలో దొంగతనాలు జరిగిన సీసీ టీవీ దృశ్యాలను బ్యాంకర్లకు ఐటీకోర్ టీమ్ సిబ్బంది స్క్రీన్ మీద చూపించారు. జిల్లాలోని పోలీసు అధికారులు బ్యాంకులను సందర్శించి సెక్యూరిటీ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బ్యాంకు అధికారులతో మాట్లాడాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని బ్యాంకుల దగ్గరకు పెట్రోలింగ్ సిబ్బంది వెళ్లి పాయింట్ బుక్‌ను తనిఖీ చేసేలా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, జిల్లా బ్యాంకర్ల ఎల్‌డీఎం ఆంజనేయులు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ మల్లేశ్వర రావు, జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజా రమేష్, సైబర్ సెల్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా సభ్యుల అరెస్టు



అరెస్టయిన అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులతో పోలీసులు

గుర్రంకొండ : అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 కిలోల గంజాయిని, ఎనిమిది సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. వాల్మీకిపురం సీఐ ప్రసాద్ , గుర్రంకొండ ఇన్‌చార్జి ఎస్ఐ చంద్రశేఖర్‌లు గత రాత్రి గుర్రంకొండలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమంది అనుమానిత వ్యక్తులు ప్లాస్టిక్ సంచుల్ని కలిగి ఉండడం గమనించి వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. దుర్గంధం వెదజల్లుతున్న నాలుగు కిలోల గంజాయిని ఒక సెల్‌ఫోన్‌ను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. దొరికిన నిందితుల్లో ఒకరు ఇచ్చిన సమాచారం మేరకు పీలేరు టౌన్‌లోని పీలేరు- కలకడ మార్గంలోని దినకర్ హోటల్ వెనుక మాటు వేసి గంజాయి విక్రయిస్తున్న వారిపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 16 కిలోల గంజాయిని, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరంతా ముఠాలుగా ఏర్పడి ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుశాంత మహానంద వద్దనుంచి గంజాయిని కొనుగోలు చేసి జిల్లాలో విక్రయిస్తున్నట్లు తేలింది. దీంతో బుధవారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుశాంత మహానంద(27), జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన షేక్ నౌషాద్ అహ్మద్(26) షేక్ ఇర్షాద్ అహ్మద్ (27, గుర్రంకొండకు చెందిన కలకడ ఆదిల్(21), టి.గణేష్(19) చిత్తూరు జిల్లా ఐరాల మండలానికి ఎస్ సిద్దయ్య(55), చిన్నమండెం మండలానికి చెందిన షేక్ ఫహాద్ అలీ(21), రాయచోటికి చెందిన గుండ్లపెంట ఆసీఫ్(23), బగినేని ప్రతాప్(24), షేక్ మహమ్మద్ అలీ(30)లను అరెస్ట్ చేసి వారిపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద ఉన్న 20 కిలోల గంజాయి, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ కేసులో గుర్రంకొండకు చెందిన కమాల్ పరారీలో ఉన్నాడు. గంజాయి ముఠాసభ్యుల్ని రిమాండ్ నిమిత్తం వాల్మీకిపురం కోర్టుక తరలించారు. గంజాయి ముఠా సభ్యుల్ని అరెస్ట్ చేయడంలో మంచి ప్రతిభ కనబరిచిన పోలీసులకు రివార్డులు అందజేశారు. మరి కొంతమంది పోలీస్ ఉన్నతాధికారులకు రివార్డు కోసం ఎస్పీకి సిఫార్సు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం సీఐ ప్రసాద్, గుర్రంకొండ ఇన్‌చార్జి ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐలు గజేంద్ర, బొజ్జానాయక్, హెడ్‌కానిస్టేబుళ్లు నాగరాజ నాయక్, అబ్దుల్లా, రిజ్వాన్ పాల్గొన్నారు.